
మీ కోసమే వెయిటింగ్: ఆనందంగా స్వాగతం పలుకుతున్న యువత


మీకు అండగా ఉంటా : నిడదవోలులో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రార్థన చేస్తున్న చంద్రబాబు





# నీరాజనసీమ


పి.గన్నవరంలో జై టీమ్: అంబాజీపేటలో అభ్యర్థులతో కలిసి అభివాదం


పి.గన్నవరంలో గుర్తుపెట్టుకోండి...


పవర్ స్టార్ ఆనందం: అభిమానం చూసి ఇలా..


మీ వెంటే : బాబు, పవన్‌తో అమలాపురం అభ్యర్థి ఆనందరావు

- వెల్లువెత్తిన అభిమానం
- అడుగడుగునా ఘన స్వాగతం
- కొబ్బరికి పూర్వవైభవం తెస్తాం
- బహిరంగ సభలో చంద్రబాబు, పవన్
- అంబాజీపేట,అమలాపురంల్లో సక్సెస్

అమలాపురం/అంబాజీపేట (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 11 : కోనసీమలో గన్నవరం గర్జించింది.. అమలాపురం అదరగొట్టింది.. కోనసీమ టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు నీరాజనసీమగా మారింది.ఎటు చూసినా జనమే.. ఎక్కడ చూసినా జనమే.. ఎక్కడి కక్కడ పువ్వులు చల్లుతూ అభిమాన నేతలకు ఘనంగా స్వాగతం పలికారు.. కోనసీమ అభిమానం రుచి చూపించారు..టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్‌షోకు ప్రజలు అపూర్వ రీతిలో స్వాగతాలు పలికారు. మహిళలైతే రోడ్లపైకి వచ్చి హారతులు ఇచ్చారు. ఆరు కిలోమీటర్ల రోడ్‌షో గంటన్నర సమయం పైగా సాగింది. రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో ప్రజలు బారులు తీరి స్వాగతం పలికారు. అంబాజీపేటలో మెయిన్‌రోడ్డుమీదా, అమలాపురంలో గడియార స్తంభం సెంటర్‌లో సభ, రోడ్ షో సుమారు నాలుగు గంటలపాటు జరిగాయి. దీంతో నేతలు ఉబ్బితబ్బిబయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు ఈసారి స్థానిక సమస్యలపైనే దృష్టి సారించి రెండు సభల్లోను ప్రసంగాలు చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దంపట్టే స్పందన ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఎన్నికలు లాంఛనమే. మనమే గెలుస్తున్నాం. మన ఆడబిడ్డల స్పందన చూ స్తుంటే, వీర వనితలు అయితే ఎప్పుడు పోలింగ్ వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. సిద్ధం అంటున్న జగన్‌కు ఇక యుద్ధమేనని చంద్రబాబు అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో గాజు గ్లాసు..అమలాపురంలో సైకిల్ గుర్తులకు ఓట్లేసి తద్వారా జగన్మోహన్‌రెడ్డి గుండెల్లోకి గుచ్చేందుకు చూస్తున్నారు. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌ను తన్ని తరిమికొట్టాలన్నారు. కోనసీమకు వన్నె తెచ్చిన వ్యక్తి బాలయోగి అన్నారు. బాలయోగిని స్పీకర్‌గా చేసిన పార్టీ టీడీపీ అన్నారు. గోదావరి జిల్లాలో చిచ్చుపెట్టి చలికాచుకునే పరిస్థితుల్లో జగన్ ఉన్నాడని చంద్రబాబు విమర్శించారు. గోదావరి ఉన్నా మీకు ఇసుక అందుతుందా అని చంద్రబాబు ప్రశ్నించారు. టీడీపీ హయాంలో రూ.1000కే ఇసుక అందేదన్నారు. ఇప్పుడు రూ.5 వేలు ఇస్తేకానీ ఇసుక రావడంలేదన్నారు. ఎవరికిపోతున్నాయి ఈ డబ్బులు అని ప్రశ్నించారు. గోదావరి జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని చంద్రబాబు అన్నారు. కోనసీమ కొబ్బరికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషిచేస్తానన్నారు. అలాగే వరికి గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద నుంచి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హలో ఏపీ.. బై బై జగన్ అంటూ చంద్రబాబు ప్రజలతో నినాదాలు చేయించారు. పవన్‌కల్యాణ్ మాత్రం స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల సమక్షంలో ఎండగట్టారు. బాబు చిట్టి అంటూ.. పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబు పేరు ప్రస్తావించకుండా ఆయనపై విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ గన్నవరం నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించిన రూ.200 కోట్ల విలువైన హామీలను అయితే ఇచ్చేశారు. ఇప్పటివరకు వాటికి అతీగతీ లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నుంచి గోదావరి రివెట్‌మెంట్లు, కాజ్‌వేల నిర్మాణం, నాడు-నేడు వంటి అంశాలపై వివరణాత్మక విశ్లేషణ చేస్తూ జగన్ ఈ ప్రాంత ప్రజలను ఏవిధంగా మోసగించారో స్పష్టంచేశారు. బాలయోగి జీవిత లక్ష్యమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌ను నిర్మించి పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామన్నారు.ఆర్బీకేలు కాకినాడకు చెందిన ఒక మాఫియా లీడర్ చేతిలో ఉన్నాయని ఆరోపించారు. యువత ఇంటి వద్దే ఉండి ఉపాధి పొందేలా వర్క్ ఫ్రమ్ హోం మాదిరిగా ఉద్యోగ అవకాశాలను కల్పించడమే తెలుగుదేశం లక్ష్యమని చంద్రబాబునాయుడు అమలాపురం సభలో స్పష్టం చేశారు. చంద్రబాబు తన ప్రసంగాన్ని సూపర్-10 పథకాలను వివరిస్తూ సరిగ్గా 9.55 గంటలకు ముగించారు. చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్ హాల్ట్‌కు బయలుదేరి 10.15 గంటలకు చేరుకున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అమలాపురం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసానికి వెళ్లారు.

## బిజిబిజీగా అధినేతలు

- నిడదవోలులోనే చంద్రబాబు రంజాన్ వేడుక
- రాజమండ్రిలో పలువురు నేతలతో పవన్ భేటీ

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/నిడదవోలు/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం సాయంత్రం 4 గంటల వరకూ జిల్లాలోనే ఉన్నారు. నిడదవోలు ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బుధవారం రాత్రి చంద్రబాబు నిడదవోలులో బస చేయగా, పవన్ కల్యాణ్, పురందేశ్వరి రాజమహేంద్రవరం షెల్టన్ హోటల్‌లో బసచేశారు. చంద్రబాబు గురువారం సుమారు 12 గంటల ప్రాంతంలో తిరుమలసాయి కల్యాణ మండపంలో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో 10 లక్షల మంది పేద ముస్లింలకు ఉచితంగా రంజాన్ తోఫా అందజేసేవారమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు ఆ సంతోషం ఉందా అని ప్రశ్నించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం దుల్హన్ పథకం ద్వారా ముస్లిం పెళ్లి జంటలకు రూ.50వేలు అందజేసేవారమని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో జంటకు రూ.లక్ష అందజేస్తామన్నారు. రంజాన్ పండుగను ముస్లింలతో జరుపుకోవడం ఆనందం ఉందన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన డాలర్ దివాకర్‌రెడ్డి, పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్యలకు పసుపు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. నిడదవోలులో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో అంబాజీపేట వెళ్లారు. ఇక పవన్ కల్యాణ్ కూడా షెల్టన్ హోటల్ నుంచే పార్టీ వ్యవహారాలు చూశారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, భీమవరం తదితర నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థులు, ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, భీమవరం అభ్యర్థి అంజిబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, అనుశ్రీ సత్యనారాయణ వంటినేతలు కలిశారు. ఉదయం నాగబాబు పవన్‌ను కలసి వెళ్లారు. సాయంత్రం 4 గంటల తర్వాత పవన్ కారులో మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో అంబాజీపేట వెళ్లారు. మరో పక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ కార్యక్రమాల్లో బిజీగా గడిపారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పురందేశ్వరితో గురువారం సాయంత్రం భేటీ కావడం గమనార్హం. రేపో మాపో అనపర్తి సీటు విషయంలో స్పష్టత రావచ్చని భావిస్తున్నారు.

### నా తండ్రి..బాలయోగి ఆశయ సాధనకు కృషి

ఐదేళ్ల రాక్షస పాలనలో ప్రజలెన్నో కష్టాలు పడ్డారు. మరో 32 రోజుల్లో ఎన్నికలు జరుగుతాయి. రానున్నది డబుల్ ఇంజన్ సర్కారే.. అధికారంలోకి వచ్చిన వెంటనే పార్లమెంట్ పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. నా తండ్రి.. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయ సాధనకు కృషిచేస్తా. కోనసీమ ప్రజల చిరకాలవాంఛ రైల్వేలైన్ పూర్తయ్యే విధంగా కృషిచేసి ఈ ప్రాంత వాసులకు రైల్వే కూత వినిపిస్తా.
**- హరీష్‌మాధుర్, అమలాపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి**

### అవకాశం ఇస్తే.. మంచి చేసి చూపిస్తా..

పి.గన్నవరం నియోజకవర్గంలో సమస్యలపై దృష్టి సారించా.. కొత్తగా వచ్చానని అనుకోవద్దు.. ఇప్పటి వరకూ పోలీస్ సేవలో ఉన్నా.. అవకాశం ఇస్తే మంచిచేసి చూపిస్తా.. నదీపరీవాహక ప్రాంతాల్లో గ్రోయిన్స్, రివిట్‌మెంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటా.కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలి.నాకున్న అనుభవంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.
**- గిడ్డి సత్యనారాయణ, పి.గన్నవరం జనసేన అభ్యర్థి**

### జగన్ దుర్మార్గాలకు ఓటుతో బుద్ధి చెప్పండి

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు సమయం ఆసన్నమైంది.. జగన్ దుర్మార్గాలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలి. రాష్ట్రంలో డ్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటుచేసి ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదే.. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతమొందించడానికి, దోపిడీలను అరికట్టడానికి, మాఫియాలకు గుణపాఠం చెప్పడానికి మోసగాడు జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజల వద్ద ఉన్న వజ్రాయుధమే ఓటు.
**- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం టీడీపీ అభ్యర్థి**


బై బై జగన్ : చంద్రబాబు పిలుపుతో చేతులెత్తిన జనం


అంబాజీపేటలో అదిరిన రోడ్ షో..




అభిమానుల షో : ఉరకలేసిన ఉత్సాహం




మీ కోసమే కలిసి వచ్చాం : అంబాజీపేట రోడ్ షోలో నమస్కరిస్తున్న చంద్రబాబు, పవన్

### సంక్షేమం పేరుతో మంత్రి దోపిడీ : చంద్రబాబు

స్థానిక మంత్రి పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వంద ఎకరాల భూమిని సేకరించారు. ఎకరాకి రూ.10 లక్షలు చొప్పున మింగేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి 50 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. ప్రభుత్వం రూ.75 లక్షల చొప్పున చెల్లిస్తే రైతులకు రూ.50 లక్షలు మాత్రమే ఇచ్చి ఎకరాకు రూ.25 లక్షలు చొప్పున మింగేశారు. మునిసిపల్ పార్కింగ్ స్థలాన్ని మంత్రి అనుచరులే అద్దెకు తీసుకున్నారు. అమలాపురంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తా. చేనేత కార్మికులకు రూ.24వేలు పథకాన్ని కొనసాగిస్తాం.40లక్షల మంది భవన నిర్మాణరంగ కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటా. జిల్లా కేంద్రమైన ఈ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, ఐటీఐలను ప్రభుత్వపరంగా ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.వారి కోసం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటాం. అమలాపురంలో శెట్టిబలిజ కల్యాణ మండపం నిర్మించాలని కోరగా ఆయన సమ్మతించారు.పనులు చేసే బాధ్యత మాది, కూటమికి ఓటేసి గెలిపించే బాధ్యత మీదని చంద్రబాబు అన్నారు.

### ఎవడ్రా మనల్ని ఆపేది : పవన్

కుల వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అమలాపురం సభలో ఆరోపించారు. పచ్చని కోనసీమను కలహాల సీమగా మార్చేశారు. ఇక్కడ కులాల మధ్య అంబేడ్కర్ పేరును లక్ష్యంగా చేసుకుని చిచ్చు పెట్టారు. లబ్ధి పొందాలని చూశారు. వైసీపీ మంత్రి ఇల్లును ఆ పార్టీవారే తగలు పెట్టుకునేలా చేశారన్నారు. కోనసీమ రైల్వేలైన్ లక్ష్య సాధనగానే ఉమ్మడి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. జనసేనను కొందరు నాయకులు వదిలి వెళ్లిపోయారు. నాయకులు వస్తారు వెళతారు. కానీ పార్టీని అంటిపెట్టుకుని ఎంతటి త్యాగానికైనా సిద్ధపడేది జనసైనికులు, వీర మహిళలేనన్నారు.గతంలో అమలాపురం సభలో హలో ఏపీ.. బైబై వైసీపీ అనే స్లోగన్‌ను ఇక్కడి నుంచే ప్రారంభించారు. మనల్ని ఆపేది ఎవడ్రా అంటూ పవన్ ఆగ్రహంగా ప్రసంగించారు.

## వైసీపీ నాయకుల ప్రలోభాల పర్వం

- రాజీనామాలు చేయాలంటూ వలంటీర్లపై ఒత్తిడి
- కాకినాడ రూరల్‌లో సమావేశాన్ని అడ్డుకున్న జనసేన


వలంటీర్ల సమావేశం ఏర్పాటు చేసిన భవనంవద్ద పోలీసులు, జనసేన నాయకులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 11: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు తెరతీశారు.వైసీపీ అధికారంలోకి తెచ్చేందుకు తక్షణమే వలంటీర్ పోస్టులకు రాజీనామా చేసి క్షేత్రస్థాయిలో మీకు కేటాయించిన 50 కుటుంబాల వద్దకెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే వలంటీర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి పలు సంక్షేమ కార్యక్రమాలు అ మలు చేస్తామంటూ వలంటీర్లకు హామీ ఇస్తూ దారిలోకి తెచ్చుకునేందుకు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి పావులు కదుపుతున్నారు. ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు వలంటీర్లతో రహస్య సమావేశాలు నిర్వహిస్తూ ప్రలోభాలకు తెరతీశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మే రకు వలంటీర్ పదవిలో ఉంటూ రాజకీయాలు చేయడం కుదరదని, తక్షణమే రాజీనామా చేయాలని, అందుకు ప్రతిఫలం గా ప్రభుత్వమిచ్చే రూ.5వేల జీతం కంటే మరో రూ.5వేలు కలి పి మొత్తంగా రూ.10వేలు ఇస్తామని ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఇప్పటికే వలంటీర్లకు సత్కారాలు పేరుతో తాయిళాలు అందించారు. ముఖ్యంగా మహిళా వలంటీర్లకు చీరలు పం పిణీ చేశారు. డ్వాక్రా యానిమేటర్లతో సమావేశాలు పెట్టించి వీరితోపాటు మహిళా సంఘాల సభ్యులకు అధికార పార్టీ నాయకులు చీరలు పంపిణీ చేశారు.

### జనసేన నాయకుల రాకతో పరారైన వలంటీర్లు

కాకినాడ నాగమల్లితోట జంక్షన్ సమీపంలోని వినాయక కేఫ్ హోటల్ పక్కనగల ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయం గదిలో కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని 2వ డివిజన్ వైసీపీ నాయకుడు సూర్యప్రకాశ్ గురువారం వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారన్న సమాచారంతో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ వెళ్లగా ఈ విషయం తెలుసుకున్న సదరు నాయకుడితోపాటు వలంటీర్లు పరారయ్యారు. అక్కడున్న ఆరుగురు వలంటీర్లను ప్రశ్నించగా పుట్టినరోజు వేడుకలకు వచ్చామని చెప్పడం, ఎందుకు పారిపోయారన్న ప్రశ్నకు పొంతలేని సమాధానాలు చెప్పడం విశేషం. జనసేన నాయకులవద్ద వైసీపీ నాయకుడు రమ్మంటే వచ్చామని, ఎంసీసీ అధికారులవద్ద పుట్టినరోజు వేడుకల కోసమని ఒకసారి, పుట్టినరోజు ప్రూఫ్ చూపాలని, పేరు చెప్పాలని కోరితే పొంతన లేని సమాధానాలు వలంటీర్లు చెప్పడం గమనార్హం. పుట్టినరోజు పార్టీ చేసుకుంటే జనసేన నాయకులు వచ్చి తమ గదికి తాళాలు వేశారంటూ వలంటీర్లు చెప్పడం విశేషం.

### వలంటీర్లతో ఎమ్మెల్యే కన్నబాబు రాజకీయం: నానాజీ

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామన్న భయంతో అధికార పార్టీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వలంటీర్లతో రాజకీయాలు చేస్తున్నారని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ విమర్శించారు. వలంటీర్లతో సమావేశం సమయంలో తాము వెళ్లగా వైసీపీ నాయకుడు సూర్యప్రకాశ్‌తోపాటు పలువురు అక్కడినుంచి గోడదూకి పరారయ్యారని తెలిపారు. వార్డుల్లో డబ్బులు పంచేందుకు, ఓటరు స్లిప్పులు పంపిణీ కోసం ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా వలంటీర్లతో సమావేశం నిర్వహిస్తున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు వచ్చి వలంటీర్లను తూతూ మంత్రంగా ప్రశ్నించి వదిలేశారని ఆరోపించారు. సంఘటనాస్థలానికి విచ్చేసిన సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకటపతిరాజులకు నానాజీ ఫిర్యాదుచేశారు. రూమ్‌లోకి వెళ్లి అక్కడ ఉన్న కృష్ణనగర్ వార్డు సచివాలయానికి చెందిన ఆరుగురు వలంటీర్లను విచారించగా ఓ వలంటీర్ పుట్టినరోజు ఫంక్షన్ కోసం వచ్చామని, సంఘటనాస్థలంలో ఏపార్టీకి చెందిన ప్రచార సామాగ్రి లభించలేదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తెలిపారు.

## దేశంలో మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే: కలెక్టర్


పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 11: భారతదేశంలో మహా నాయకులందరికీ ఆదర్శంగా నిలిచిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలేఅని కలెక్టర్ జె.నివాస్ కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కాకినాడ జీజీహెచ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ నివాస్ గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కాకినాడ ఆర్డీవో కిషోర్, బీసీ సంక్షేమాధికారి లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి, జౌళిశాఖ ఏడీ పెద్దిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పటిష్ట తనిఖీలు నిర్వహించాలి: ఎస్పీ


చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా సరిహద్దుల నుంచి అక్రమంగా మద్యం, నగదు రవాణా నివారణకోసం చెక్‌పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణతో పటిష్టంగా తనిఖీలు చేపట్టాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల్లో ధనం, మద్యం, నాటుసారా, తాయిలాల వంటి ప్రలోభాలకు గురిచేసే వస్తుసామాగ్రి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లాకు అనుసంధానించే వేళంగి, జగన్నాథగిరి, గొల్లలమామిడాడ వంటి అంతర రాష్ట్ర, అంతర జిల్లా సరిహద్దులవద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. జప్తు చేసే సమయంలో ఎస్ఎస్‌టీ బృంద సభ్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు.ఎస్పీ వెంట కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్, కరప, గొల్లపాలెం, పెదపూడి ఎస్ఐలు ఉన్నారు.

# అడవిలో రాజుకున్న మంటలు అదుపులోకి..

మోతుగూడెం, ఏప్రిల్11: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో మూడు రోజులుగా అడవిలో రాజుకున్న మంటలను అటవీ శాఖ సిబ్బంది అదుపు చేసే ప్రయత్నం చేశారు. గత మూడు రోజులుగా అడవులు అంటుకుని కాలుతుంటుంటే చుట్టుపక్కల గ్రామాలకు పొగ కమ్మేసింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి డీఎఫ్‌వో బబిత ఆదేశాలు ప్రకారం లక్కవరం రేంజ్ వెంకట నానాజీ ఆధ్వర్యంలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. గొందిగూడెం బీట్ సుకుమామిడి సౌత్ చింతూరు బౌండరీ డివిజన్ మారేడుమిల్లి బౌండరీ డివిజన్‌లో దగ్ధమవుతున్న అడవులను నీటితో ఆర్పి అదుపు చేశారు. బీట్ ఆఫీసర్ వెంకట్, స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది రవి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది



# పిఠాపురం దర్గాలో హైపర్ ఆది ప్రత్యేక ప్రార్థనలు

**ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన జనసేన స్టార్ క్యాంపెయినర్**

పిఠాపురం, ఏప్రిల్ 11: పిఠాపురం పట్టణంలో వస్తాదు వీధి దర్గాలో సినీ నటుడు, జనసేన స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పిఠాపురంలో పవన్ గెలుపు కోసం ప్రార్థనలు చేశామని హైపర్ ఆది తెలిపారు. పవన్ విజయం సాధిస్తే పిఠాపురం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అలాగే పట్టణంలోని కత్తుల గూడెం, పక్షులమర్రిచెట్టు సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, మెయిన్‌రోడ్డు, కాకినాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పరస్పరం అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంజాన్ సందర్భంగా పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. నెలరోజులు పాటు చేసిన ఉపవాస కార్యక్రమాలు ముగిశాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు మసీదుల వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

## అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 11: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన వెలగల కాశీవిశ్వేశ్వరరెడ్డి-వెంకటలక్ష్మి దంపతులు రూ.1,11,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.2,88,200 లభించినట్టు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వాడపల్లి వెంకన్నను ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## 18 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు



ఆత్రేయపురం, ఏప్రిల్ 11: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన చర్యలపై ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం రెండోసారి సమీక్షించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

## జూదం ఆడుతున్న 16 మందిపై కేసు

రాజవొమ్మంగి ఏప్రిల్ 11: శాంతినగర్ గ్రామ శివారులో బొమ్మ బొరుసు ఆట(చిత్తులాట) ఆడుతున్న 16 మందిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.4750 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకయ్య తెలిపారు. డబ్బులు పనంగా పెట్టి ఇటువంటి ఆటలు ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ సూచించారు.

## ప్రధాన పంట కాల్వలో బాలుడు గల్లంతు

పి.గన్నవరం, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరం ప్రధాన పంట కాల్వలో 11ఏళ్ల బాలుడు గురువారం ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లంకలగన్నవరం ఏటిగట్టు చెంతనే ప్రధాన పంట కాల్వ ఎదురుగా నివాసం ఉంటున్న గుడాల దుర్గాప్రసాద్-జ్యోతి దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు సాయినాగేంద్ర (11) దివ్యాంగుడు. పాఠశాలకు సెలవు కావడంతో ముగ్గురూ ఉదయం ఇంటివద్దే ఆడుకుంటున్నారు. కాల్వ వద్దకు వెళ్లిన సాయి ప్రమాదవశాత్తు పంట కాల్వలో గల్లంతైనట్టు స్థానికుడు ఒకరు గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి దుర్గాప్రసాద్ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు


ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ కాటన్ పరిషత్ వేదికపై నిర్వహించిన 24వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. మూడో రోజు తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' ప్రదర్శితమైంది. ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించగా స్నిగ్ధ రచించారు. లీలామోహన్ సంగీతం సమకూర్చారు. పచ్చల శేషగిరి ఆహార్యం వర్క్స్ నిర్వహించగా, పచ్చల శివరామకృష్ణ రంగాలంకరణ చేశారు. రెండో నాటికగా మైత్రి కళా నిలయం విజయవాడ వారి 'బంధం' ప్రదర్శించారు. టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించగా మాడుగుల రామకృష్ణ రచించారు. లీలామోహన్ సంగీతం సమకూర్చారు. నిర్వహణ పీటీ కుమార్ వ్యవహరించగా, రంగాలంకరణ పిఠాపురం బాబూరావు చేశారు. మూడో నాటికగా డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ) రచించిన కృష్ణాంజనేయం ప్రదర్శించారు. నాటకీకరణ, దర్శకత్వ బాధ్యతలు గంటా రామ్మోహనరావు తీసుకున్నారు. కళాకారులు తమ హావభావాలతో ప్రేక్షకులను ఆద్యంతం మంత్రముగ్ధులను చేశారు. అంతరించిపోతున్న నాటక రంగాన్ని, కళాకారులను ప్రోత్రహిస్తున్న సీఆర్సీకి కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రచార వాహనాలు సీజ్

పిఠాపురం, ఏప్రిల్ 11: అనుమతులకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రచార వాహనాలను పిఠాపురం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. పిఠాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రచార వాహనాల అనుమతులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. అనుమతించిన సైజ్ కంటే అధిక సైజులో, పరిమితికి మించి వాహనాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, ఇతర నిబంధనలు పాటించకపోవడంతో వైసీపీ అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు చెందిన మూడు ప్రచార ఆటోలను సీజ్ చేసి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ వాహనాలకు జెండాలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు అనుమతులు పొందిన వాటి కంటే సైజు ఎక్కువగా, అదనంగా ఉండటంతో వీటిని సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి పైడిరాజు తెలిపారు. జనసేనకు చెందిన ఒక వాహనాన్ని కూడా సీజ్ చేశారు.


సీజ్ చేసిన వంగా గీత ప్రచార వాహనాలు, ఒక జనసేన వాహనం

# అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు తనిఖీ


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కరప, ఏప్రిల్ 11: కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ గురువారం కరప మండలంలో పర్యటించి అంతర జిల్లాల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కోనసీమ జిల్లా సరిహద్దు వేళంగి, జగన్నాథగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులతో బాటు తూర్పుగోదావరి జిల్లా సరిహద్దు గొల్లల మామిడాడ వద్ద నిర్వహిస్తున్న చెక్‌పోస్టులను ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ధన, మద్యం, నాటు సారాయి, తాయిలాలకు సంబంధించిన వస్తు సామగ్రి రవాణాకు అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో అంతర జిల్లా సరిహద్దుల వద్ద ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం నిఘాతో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన విధి విధానాలను సిబ్బంది కచ్చితంగా పాటించాలని, సోదా, జప్తులకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ఎస్ఎస్‌టీ బృంద సభ్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగేలా చూసుకోవాలన్నారు. చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రతీరోజు పర్యవేక్షించుకుంటూ సక్రమ నిర్వహణ ఉండేలా చూసుకోవాలన్నారు. వాహన తనిఖీల సిబ్బంది ఎండల నుంచి రక్షణ పొందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, కరప ఎస్ఐ టి.రామకృష్ణ, గొల్లపాలెం, పెదపూడి ఎస్ఐలు పాల్గొన్నారు.



## ఎన్డీయే అభ్యర్థికి మద్దతుగా భారీ ర్యాలీ

యానాం, ఏప్రిల్ 11: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఎన్డీయే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆ రాష్ట్ర హోం మంత్రి నమశ్శివాయకు మద్దతుగా యానాంలో గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. సుమారు మూడు వేల మంది పాల్గొన్నారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, ఎన్డీయే అభ్యర్థి నమశ్శివాయ, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. యర్రా గార్డెన్స్‌లోని మల్లాడి ఇంటి వద్ద ప్రారంభమైన ర్యాలీ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ సాగింది. బీజేపీకి ఓటు వేసి నమశ్శివాయను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు మల్లాడి పిలుపునిచ్చారు. ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్రేన్‌తో అతిథులను గజమాలతో సత్కరించారు.



## చంద్రబాబును కలిసిన బండారు సోదరులు

కొత్తపేట, ఏప్రిల్ 11: అంబాజీపేట ప్రజాగళం ప్రచార సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తన సోదరుడైన జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌ను బాబుకు పరిచయం చేశారు.

## గ్యాస్ లీకై నాలుగు తాటాకిళ్లు దగ్ధం

కొండెవరం(కొత్తపల్లి), ఏప్రిల్ 11: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం గొల్లపేటలో గురువారం వంట గదిలో గ్యాస్ లీకై నాలుగు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. మోరుకుర్తి వెంకటరమణ, సత్తిబాబు, వీరాస్వామి, శ్రీనుకు చెందిన ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో బాధితులు రోడ్డున పడ్డారు. పిఠాపురం అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణం రాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## పురందేశ్వరి దంపతులతో నల్లమిల్లి భేటీ


పురందేశ్వరి దంపతులతో మాట్లాడుతున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 11: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి దంపతులతో భేటీ అయ్యారు. అనపర్తి అసెంబ్లీ సీటు మార్పుపై ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో మరోసారి వీరు భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి సీటు బీజేపీ నుంచి టీడీపీకి మార్పు చేసేందుకు ఇరు పార్టీల అధినేతలు సుముఖంగా ఉన్నారని, ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు తనకు పూర్తి భరోసా ఇచ్చారని, ఒకటి రెండు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు.

## నేడు ఇంటర్ ఫలితాలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. ఫలితాలను http://results.bie.ap.gov.in వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గత నెల 1 నుంచి మొదటి, 2 నుంచి రెండో ఏడాది పరీక్షలు ప్రారంభమై 20న ముగిశాయి. జిల్లాలో మొదటి ఏడాది 19336, రెండో ఏడాది 18166 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గత ఏడాది మొదటి ఏడాది 59 శాతం, రెండో ఏడాది 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

## రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



తుని రూరల్, ఏప్రిల్11: తుని రైల్వే స్టేషన్ పరిధిలో నరసింగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 65 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఢీ కొనడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంబంధీకుల వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ లోవరాజు తెలిపారు.

## 14న రైతు సదస్సు

తుని రూరల్, ఏప్రిల్ 11: ఈ నెల 14న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీ ప్రకాష్ విద్యా సౌధం నిర్వాహకులు తెలిపారు. పాయకరావుపేటలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఏకే సింగ్, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ ఎలినేని రాఘవరావు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ డాక్టర్ మన్మోహన్‌సింగ్, సీనియర్ సైంటిస్ట్ సి.రవీంద్రరెడ్డి హాజరవుతారని తెలిపారు.

### వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ఎటపాక, ఏప్రిల్ 11: వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి విస్సాపురం గ్రామానికి చెందిన కుంజా ముద్దరాజు (52) మంగళవారం గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. అయితే పని చోటే ఎండదెబ్బకు ముద్దరాజు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు గౌరిదేవీపేట పీహెచ్‌సీకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలానికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ముద్దరాజు మంగళవారం రాత్రి మృతి చెందాడు.



# సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిష్కరిస్తా


రెల్లి కులస్థుల సమస్యలు వింటున్న పవన్‌కల్యాణ్

**మాటలు చెప్పను**
**పనిచేసి చూపిస్తా**
**పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా**
**జనసేన అధినేత పవన్‌కల్యాణ్**

పిఠాపురం, ఏప్రిల్ 11: సమస్యల మూలాల్లోకి వెళ్లి వాటి పరిష్కార మార్గాలు అన్వేషించడంతో పాటు వాటిని అమలు చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. తాను మాటలు అధికంగా చెప్పనని, ఆచరణలో పనిచేసి చూపిస్తానని చెప్పారు. పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం పట్టణానికి చెందిన రెల్లి కులస్థులు, మరికొందరు చేబ్రోలులో మంగళవారం కలిశారు. ఆ వీడియోలు గురువారం విడుదల చేశారు. వారితో ప్రత్యేకంగా సమావేశమైన పవన్ సమస్యలు, ఇబ్బందులు తెలుసుకోవడంతో పాటు తన ఆలోచనలను పంచుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం వెళ్లి ప్రజలకు, మహిళలకు ఏం అవసరం, వారి ప్రతిభ, వారికి ఏయే రంగాల్లో ఆసక్తి ఉంది తదితర విషయాలను తెలుసుకుని వారికి ఉపాధి కల్పించే దిశగా జనసేన అడుగులు వేస్తుందని పవన్ తెలిపారు. పిఠాపురాన్ని తన స్వస్థలం చేసుకుని ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన చేసుకుని వాటి పరిష్కార మార్గాలను చూపుతానని చెప్పారు. తల్లిదండ్రులు పడ్డ బాధలు ఇక యువత పడాల్సిన అవసరం లేదని, వారు గౌరవంగా తలెత్తుకుని బతికేలా చేసే బాధ్యత తనది అని తెలిపారు. తాను మాటలు చెప్పేవాడని కానని పనులు చేసి చూపించడమే తన అభిమతమని చెప్పారు. 54 గ్రామాలు, రెండు పట్టణాల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. తాను ఏ పనిచేసినా ఇష్టంతో చేస్తానని, మీరు చూపించే ప్రేమ కంటే అధికంగా అంతే ప్రేమ మీ పై చూపించి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

**పోస్టులు అమ్ముకున్నారు**

పిఠాపురం పురపాలక సంఘంలో అవుట్ సోర్సింగ్ పోస్టులను రూ.3లక్షలు వంతున అమ్ముకుంటున్నారని, విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబసభ్యులకు ఉద్యోగం కావాలంటే రూ.5లక్షల వరకూ లంచం ఇవ్వాల్సి వస్తున్నదని రెల్లి కుల యువకులు పవన్ దృష్టికి తీసుకువచ్చారు. తామంతా పదో తరగతి నుంచి ఎంబీఏ వరకూ చదువుకున్నామని, అయితే ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయామని తెలిపారు. కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'తమను అక్కున చేర్చుకుని మాట్లాడింది మీరు ఒక్కరేనని రెల్లి కులస్థులు పవన్‌తో చెప్పారు. పవన్‌ను కలిసిన వారిలో అల్లం కిషోర్, బంగారు లక్ష్మి తదితరులు ఉండగా, సమావేశంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఉన్నారు.

## ఎమ్మెల్యే కొండేటి చూపు కాంగ్రెస్ వైపు?

మామిడికుదురు, ఏప్రిల్ 11: పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. బుధవారం రాత్రి ఆయన తన అనుచరులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అభిప్రాయాలు సేకరించినట్టు తెలిసింది. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావుకు వైసీపీ టిక్కెట్ కేటాయించనప్పటి నుంచి చిట్టిబాబు కినుకు వహించి పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇటీవల స్వగ్రామంలో జరిగిన ప్రచారానికి కూడా హాజరు కాలేదు. చిట్టిబాబు శనివారం కాంగ్రెస్‌లో చేరి పి.గన్నవరం నుంచి ఆ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

## పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న మధుసూదనరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11: ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే తమ లక్ష్యమని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.మధుసూదనరావు పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ ఆశయ సాధన 'పే బ్యాక్ టు ద సొసైటీ' లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అల్లవరం ఎంఈవో కె.కిరణ్‌బాబు, సమగ్ర శిక్షా ఏపీవో ఎంఏకే భీమారావు, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, హెచ్ఎంలు గుంట్రు వెంకటేశ్వరరావు, కాశి ఘన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

## నేడు 'డయల్ యువర్ డీఎం'

ఏలేశ్వరం, ఏప్రిల్ 11: ప్రయాణికుల సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఉత్తమమని ఏలేశ్వరండిపో మేనేజర్ జి.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవ లందించేందుకు గాను శుక్రవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు సూచనలు, సలహాలు 9959225532లో తెలియజేయాలన్నారు.

## 'వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం'

పిఠాపురం, ఏప్రిల్ 11: వైసీపీ రాక్షస పాలన పట్ల విసుగుచెందిన ప్రజలు జగన్‌ను ఓడించేందుకు సిద్ధమయ్యారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కొందరు ప్రజాప్రతినిధులు గురువారం జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి నాగబాబు జనసేనలోకి ఆహ్వానించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి వందలాది మంది యువత, మహిళలు, రైతులు, కార్మికులు అన్నివర్గాల ప్రజలు జనసేనలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, ప్రోగ్రామ్ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మలపల్లి సాయిచంద్రశేఖర్, అధికార ప్రతినిధి శరత్ తదితరులు ఉన్నారు.

## 'కూటమిని అధికారంలోకి తీసుకురావాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 11: రాష్ట్రాభివృద్ధి, నిరుద్యోగ యువత తలరాతలు మారాలంటే చంద్రబాబు,పవన్‌ల నాయకత్వంలోని టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి కోరారు. గురువారం కాకినాడ రూరల్ సర్పవరంలో ఇంటింట ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యేగా నానాజీ, ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్‌ల గెలుపు కోసం గాజుగ్లాసు గుర్తుపై ఓట్లేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, బోళ్ల కృష్ణమోహన్, గుడ్లు అప్పారావు ఉన్నారు.

## 'కూటమితోనే యువతకు ఉపాధి అవకాశాలు'

ఏలేశ్వరం, ఏప్రిల్ 11: సంక్షేమ పథకాలతోపాటు, యువతకు ఉపాధి అవకాశాలు కూటమితోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ తనయుడు సాయితర్షిక్ పట్టణంలో 2వ వార్డులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తల్లి సత్యప్రభను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు నూతి బూరయ్య, పసల సూరిబాబు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోనాల వెంటరమణ, ఎండగుండి నాగబాబు, పెండ్ర శ్రీను, బుగతా శ్రీను, ఎస్.జి. సుబ్బరాజు పాల్గొన్నారు.

## సత్యప్రభను కలిసిన ఎమ్మెల్యే పర్వత సోదరులు


సత్యప్రభను కలిసిన ఎమ్మెల్యే సోదరులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11: ప్రత్తిపాడు టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజాను ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్రప్రసాద్ సోదరులు కలిశారు. ఎమ్మెల్యే తోబుట్టువులైన పర్వత సురేష్, పర్వత సత్యనారాయణలతో పాటు ఎమ్మెల్యే మేనల్లుడు కొండమూరి చంటిబాబు గురువారం స్థానిక తోట వీధిలోని దివంగత నేత వరుపుల రాజా స్వగృహానికి వి చ్చేసి సత్యప్రభకు పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో ప్రత్యర్థి పార్టీ వైసీపీకి చెందిన ఎమ్మెల్యే పర్వత కుటుంబీకులు సత్యప్రభను కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే పర్వత కుటుంబీకులు టీడీపీలోకి చేరడం ఖాయమనే ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతుంది. కూటమి అభ్యర్థి సత్యప్రభకు మద్దతు ఇచ్చి సంఘీభావం తెలపడానికి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కుటుంబీకులు వచ్చారని, పర్వత కుటుంబానికి చెందిన టీడీపీ నేత తెలపడం విశేషం.

## డంపర్‌బిన్స్ చోరీపై కేసు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 11: కాకినాడ నగరపాలకసంస్థ హెల్త్ సెక్షన్ ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన డంపర్‌బిన్స్ చోరీకి గురవుతుండగా మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డి.పృథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాయుడు, లాజరస్ సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా సీఐ నాయక్ విచారణ చేపట్టారు. నగరంలో హెల్త్ సెక్షన్ ఆధ్వర్యంలో కూడళ్లలో 120 లోకేషన్స్‌లో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ డంపర్‌బిన్స్‌పై కన్నేసిన కొంతమంది రాత్రివేళల్లో దొంగలించి పాత ఐరన్ దుకాణాల్లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. చివరికి ఈనెల 1న సుమారు 12బిన్స్ చోరీ చేసి రూరల్ ప్రాంతంలోని ఒక పాతినుప కొట్టులో వీటిని కట్‌చేసి లారీలో లోడ్ చేసి తరలిస్తుండగా సమాచారం అందడంతో కార్పొరేషన్ అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## ఇద్దరు బాల కార్మికుల గుర్తింపు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 11: కాకినాడ జిల్లా పరిధిలో ఆపరేషన్ స్వేచ్ఛ-2024 కార్యక్రమం కింద వివిధ వాణిజ్య సముదాయాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు బాలకార్మికులను గుర్తించి విముక్తి కల్పించినట్లు యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, కాకినాడ మహిళా పీఎస్ సీఐ పి.రామచంద్రరావు తెలిపారు. ఏపీ సీఐడీ ప్రధాన కార్యాలయం ఆదేశాలతో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఈనెల 5 నుంచి 11 వరకు జిల్లా ఏంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, పోలీసులు, జిల్లాకార్మిక శాఖ,ఇతర ఎన్‌జీవోల భాగస్వామ్యంతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. పెద్దాపురం, కాకినాడ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని వాణిజ్య సముదాయల్లో ఇద్దరు బాలకార్మికులను గుర్తించి, బాండెడ్ లేబర్‌గా విముక్తి కల్పించామన్నారు. కాకినాడ, పెద్దాపురం, ఏలేశ్వరం సహాయ లేబర్ అధికారులు జీ లక్ష్మి స్నేహ, జి.సత్యనారాయణ, వి.శేఖర్‌లు పాల్గొన్నారు.

## శ్రీనివాస బాబాకు బుజ్జగింపు

సర్పవరం జంక్షన్, మార్చి 11: టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పదవి ఎంపికలో అధిష్ఠానం తన పేరును పరిగణనలోకి తీసుకోకపోవడం పట్ల పార్టీ కార్యకర్తల సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేసిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబాను పార్టీ పెద్దలు బుజ్జగించారు. సోమవారం అశోక్‌నగర్‌లోని శ్రీనివాస బాబా నివాసానికి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడు పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆరోగ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావులు వెళ్లి చర్చించారు. శ్రీనివాసబాబాతో పశ్చిమ గోదావరి జిల్లా కోఆర్డినేటర్ మందలపు రవి, పార్టీ జోనల్ ఇన్‌చార్జి సుజయ్ రంగారావులతో మాట్లాడించారు.

## రెడ్‌క్రాస్ అంధుల పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

కాకినాడ (కార్పొరేషన్), ఏప్రిల్ 11: ఆయిల్ ఇండియా కంపెనీ వారి గోదావరి లేడీస్ క్లబ్ వారి ప్రాజెక్టు స్మైల్‌లో భాగంగా గురువారం రెడ్‌క్రాస్ గ్రీన్‌ఫీల్డ్ అంధుల పాఠశాలకు ఒక స్టీల్ అల్మారా, ఆఫీస్ టేబుల్, ఛైర్‌ను కాకినాడ ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంజన్‌జ్యోతిపుకాన్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుకు అందించారు. గోదావరి లేడీస్ క్లబ్ సభ్యులు రాఖీగొగోయ్, పల్లుణి బారువా, శాంతిరావు, ఇందిరా కిషోర్, బినితా బెహెరా, గీతారామ్, సుమీదేకా ఉన్నారు.

## వేండ్రలో 'న్యాయం కోసం నల్లమిల్లి'

కరప, ఏప్రిల్ 11: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లి భాగంగా గురువారం నల్లమిల్లి కుటుంబ సభ్యులు తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి, తనయ డాక్టర్ సనాతనితో కలిసి పెదపూడి మండలం వేండ్ర గ్రామంలో పర్యటించారు. నల్లమిల్లి అభిమానులు మేమంతా మీ వెంటే ఉంటామని, మీరు ఏ నిర్ణయం తీసుకున్నా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా కల్పించారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

## 'ఆదిత్య'లో ఫుడ్ ఫెస్టివల్

గండేపల్లి, ఏప్రిల్ 11: సూరంపాలెంలో ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు వివిధ భారతీయ రాష్ట్రాలు, ఆఫ్రికన్ న్యూఇయర్ సందర్భాన్ని పురస్కరించుకుని ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ ఆహారాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది స్వరూప, సుజియా పాల్గొన్నారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలోరేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ సారథ్యంలో ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ అండ్‌మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ముగిసిందని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు.

## కేంద్ర సాయుధ బలగాల కవాతు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 11: జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, పెద్దాపురం ఎస్‌డీపీవో కె.లతాకుమారి ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం గురువారం కాకినాడ సిటీ పరిధిలో త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. త్రీటౌన్ సీఐ ఏకృష్ణభగవాన్, తొండంగి ఎస్ఐ బి.వినయప్రతాప్ ఆధ్వర్యంలో కవాతు జరిగింది.

## చంద్రబాబును కలిసిన గుణ్ణం చంద్రమౌళి



సామర్లకోట, ఏప్రిల్ 11: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని తిరుమల సాయి ఫంక్షన్ హాలు నందు టీడీపీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబును పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి గురువారం సాయంత్రం కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లాలో 7 అసెంబ్లీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని చంద్రమౌళికి చంద్రబాబు సూచించారు. రిత్విక్ కూడా పాల్గొన్నారు.

## ముక్కొల్లులో సునీత ప్రచారం

కిర్లంపూడి, ఏప్రిల్ 11: మండలంలోని ముక్కొల్లులో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు.

# పూలే చూపిన బాటలోనే పయనం

» జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

» ఘనంగా నివాళులర్పించిన నేతలు


పిఠాపురం: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వర్మ, జగ్గంపేట: పూలే చిత్రపటానికి నెహ్రూ నివాళి

పిఠాపురం, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావుపూలే చూపిన బాటలోనే టీడీపీ పయనిస్తూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతిని గురువారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి వర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అన్నారు. మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన స్ఫూర్తి ప్రదాతగా అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాకినాడ సిటీ:** టీడీపీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి కొండబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కాకినాడ ఈద్గా మైదానంలో గురువారం జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక అన్నమ్మఘాటీ సెంటర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు దళిత గిరిజన బీసీ ముస్లిం క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షుడు జోకుబుర్ర భద్రం మాస్టారు, కార్యవర్గ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యవే దిక ప్రధాన కార్యదర్శి సాపే సుధాకర్, ఉపాధ్యక్షుడు ఆవుపాటి ఉమాశంకర్, కార్యవర్గ సభ్యులు సిద్ధాంతపు రాజు, కొండేపూడి రవికుమార్, నందిక వీరబాబు, మల్లాం మధు,ఆటోయూనియన్ సభ్యులున్నారు.

**జగ్గంపేట:** జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, రేఖ బుల్లిరాజు, శిలామంతుల వీరబాబు, తంగెళ్ల అప్పారావు, బొండా శ్రీనుబాబు, రాయుడు స్వామి, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, పులి ప్రసాద్, బుదిరెడ్డి శ్రీనివాస్, మదారపు వీరబాబు, ఎల్లపు రాంప్రసాద్, పోబోలు సీతారామస్వామి పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడులో జిల్లా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు, నాయకులు ముచ్చి అప్పలరాజు, మదినే నూకరాజు, ఒమ్మి గంగరాజు, యడ్ల వీరాస్వామి, చిలపర్తి శ్రీను, కట్టమూరి కొండబాబు, ఎం. రాజారావు, ఎస్.నాగబాబు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు బుగతా బంగార్రావు, నాయకులు కె.జనార్దన్, మానుకొండ లచ్చబాబు, వాడబోయిన శివ తదితరులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

**ఏలేశ్వరం:** స్థానిక కోనేటి స్కూల్ వద్ద టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి కౌన్సిలర్ అలమండ చలమయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలమండ దుర్గా వెంకటప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, తురైతు గురవయ్య అలమండ వీర్రాఘవస్వామి, కడింశెట్టి వాసు, సింహాద్రి బ్రహ్మం, ఉడతల రమణారావు, పైల శ్రీధర్ పాల్గొనారు.

**కరప:** స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న పూలే విగ్రహానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమన్న, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నక్కా వీరభద్రరావు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతికుమార్, వాసంశెట్టి శ్రీనివాస్, కమిడి మంగాదేవి శంకర్, వాసంశెట్టి రామారావు, ఉపసర్పంచ్ బోగిరెడ్డి సూర్యనారాయణ, సర్పంచ్‌ల సమాఖ్య మండలాధ్యక్షుడు రొక్కాల గణిరాజు, ఎమ్. బాస్కర్ ఉన్నారు.

# రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


సామర్లకోట: ప్రచారరథంపై మాట్లాడుతున్న రాజప్ప

### పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం

సామర్లకోట, ఏప్రిల్ 11: రానున్న ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. గురువారం రాత్రి సామర్లకోట మండలం జీ.మేడపాడు గ్రామంలో ఇంటింటా ప్రచారంలో భాగంగా కాకినాడ పార్లమెంటరీ తెలుగురైతు అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు స్వగృహంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశం నిమ్మకాయల రంగనాగ్, తోటకూర శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజప్ప మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలుంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో కార్యకర్తల్లో ఉత్సాహం, ప్రజల్లో సానుకూలత, స్పందన స్పష్టంగా కనిపిస్తుందన్నారు. 3 పార్టీల శ్రేణులు నియోజకవర్గస్థాయి నుంచి పోలింగ్ బూత్ వరకూ సమన్వయంతో పనిచేస్తే విజయం మరింత సులభం అవుతుందని, అందుకోసం అందరూ ఐక్యంగా పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాజప్పతో పాటు కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పలువురు నాయకులు ఉన్నారు.


తాళ్లరేవు: ఎన్నికల ప్రచారంలో బుచ్చిబాబు

### 'కూటమిదే విజయం'

తాళ్లరేవు, ఏప్రిల్ 11: ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమే విజయం సాధిస్తుందని అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. తాళ్లరేవు గ్రామకమిటీ, క్లస్టర్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో బుచ్చిబాబును ప్రజలు హారతులతో స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నడింపల్లి వినోద్, కంచర్ల లక్ష్మణరావు, గంజా సూరిబాబు, కుడిపూడి దుర్గాప్రసాద్, వాసంశెట్టి శ్రీనివాసరావు, గంటా గోపి, పితాని హేమలత, మోర్త కమలాదేవి, వడ్డి విజయ కుమార్, రేల్ల చక్రవర్తి, పెన్నాడ వేణి, జనసేన మండలాధ్యక్షుడు అత్తిలి బాబూరావు, బీజేపీ మండలాధ్యక్షుడు కొపనాతి వర్మ, విత్తనాల కరిమిల స్వామి, జనసేనవీరమహిళ ముత్యాల జయలక్ష్మి, రామచంద్రుడు పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా తాళ్లరేవు, సీతారామపురం, సుంకరపాలెం మసీదుల్లో ముస్లిం సోదరులతో కలిసి దాట్ల ప్రార్థించారు.

### 'వైసీపీ నేతలను నిలదీయాలి'

పిఠాపురం, ఏప్రిల్ 11: ఓట్లు కోసం వైసీపీ నేతలు ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని, వారిని నిలదీసి ప్రశ్నించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని 16,19 వార్డులు రథాలపేట, అయితేనగర్‌ల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లును గాజుగ్లాసు గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, పిల్లి చిన్నా, కొరుప్రోలు శ్రీను, వార్డు ఇన్‌చార్జిలు యాళ్ల గణేష్, దురాడ విజయలక్ష్మి, కూసి సత్తిబాబు, కుక్కల ప్రసాద్, నూతాటి ప్రకాష్, నల్లా శ్రీను, సోము సత్యనారాయణ, సూరవరపు సుబ్బారావు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు, నాగమురిడిరాజు ఉన్నారు.

**గొల్లప్రోలు రూరల్:** జనసేన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, పాలపర్తి వీర్రాజు, గణసాల నాగరాజు, పిట్టా రాంబాబు, మల్లిబాబు, జనసైనికులు కొశిరెడ్డి సురేష్, వింజరపు రామకృష్ణ, చక్రరావు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్


పెద్దాపురంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పెద్దాపురం, ఏప్రిల్ 12: పట్టణ, పరిధిలోని ముస్లిం సోదరులు రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించుకున్నారు. స్థానిక షాహీ జామియా మసీదు (పెద్ద మసీదు)లో, ఈద్గా మెట్టపై ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ విశిష్టతను మసీదులో ముస్లిం మత పెద్దలు వివరించారు. ముస్లిం సోదరులు దువా అనంతరం ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

**సామర్లకోట:** సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముస్లిం సోదరులను అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. జమాయితుల్ ఖురేషీ అహ్లే లెహదీస్ మసీదు కమిటీ అధ్యక్షులు మొహ్మద్ ఇనాముల్లా, మహ్మద్ ఫిరోజ్, ఎండీ సైపుల్లా, ఇమామ్ మునిఫీక్ అహ్మద్ తదితరులున్నారు.

**పోర్టుసిటీ (కాకినాడ):** కాకినాడలో మెయిన్‌రోడ్ పెద్ద మశీదు, కొత్తపేటలోని చిన్న మశీదు, రామకృష్ణారావుపేట, సాంబమూర్తినగర్, సినిమారోడ్, జగన్నాధపురం, భానుగుడి ప్రాంతాల్లోని మసీల్లో మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. జేఎన్‌టీయూ వద్ద ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ పాల్గొన్నారు.

**తుని రూరల్:** తుని రూరల్ ఎస్.అన్నవరం శివారు ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు.

**జగ్గంపేట:** పట్టణంలోని కాకినాడ రోడ్డులో మసీదు వద్ద ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో అల్లా ప్రవచనాలు, ఖురాన్ ప్రవచనాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**రౌతులపూడి:** గ్రామంలో మాదీనా మసీద్‌లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. షేక్ సలీమ్, షేక్ తానుషావల్లి, షేక్ సల్మాన్, షేక్ బాషా,షేక్ సర్దార్ ఉన్నారు.

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, టి.రాయవరం, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో మసీదుల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**గొల్లప్రోలు:** గొల్లప్రోలు నూర్‌భాషా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు, ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## నేటి నుంచి పీవో, ఏపీవోలకు శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 11: ఎన్నికల విధుల్లో ఉండే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణా ఏర్పాట్లను గురువారం పరిశీలించారు.

## బీసీలకు వెన్నుదన్నుగా ఎన్టీఆర్, చంద్రబాబు

### పలుచోట్ల జయహో బీసీ కార్యక్రమాలు


కాకినాడలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 11: బీసీల ఓట్లతో ఆధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ఐదేళ్లలో అన్ని విధాలుగా బీసీ వర్గాలను నమ్మించి మోసాడని, ఆనాడు ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు బీసీలకు వెన్నుదన్నుగా నిలిచి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డారని కాకినాడ సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. 37వ డివిజన్ పాత బస్టాండ్ ఏరియాలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, కేవీఎస్ మూర్తి, మేడిశెట్టి చిన్ని, నల్లూరి శ్రీనివాస్, చింతాపేర్రాజు, బొడ్డు అంజిబాబు, డివిజన్ నాయకులు మల్లాడి గంగాధరం, కొప్పాడి రాజు, దండుప్రోలు సూర్యనారాయణ, మల్లాడి లోవరాజు పాల్గొన్నారు.

**పెద్దాపురం:** వైసీపీ పాలనలో బీసీలకు తీరని ద్రోహం జరిగిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మం డలంలోని కట్టమూరులో ఆర్యవైశ్య సేవాసంఘ భవనంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేతలు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్, కర్రి వెంకటరమణ, గోలి వెంకట అ ప్పారావు చౌదరి, మాదిరెడ్డి రామకృష్ణ, తుమ్మల నాని, మాజీ జడ్పీటీసీ సుందరపల్లి శివనాగరాజు పాల్గొన్నారు.

**శంఖవరం:** జగన్ పాలనలో బడుగులు తీవ్రంగా నష్టపోయారని చంద్రబాబు ప్రభుత్వం రాగానే బీసీలకు ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి వారిని న్యాయం చెయ్యడానికి కృషి చేస్తారని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం సీతంపేట యాదవ కమ్యునిటీహాలులో జయహో బీసీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, గ్రామ అధ్యక్షుడు పిర్ల అప్పారావు, ఉగ్గిరాల నాగేశ్వరావు, మెరపల నరసయ్య, బద్ది రమణ, ఈగల దేవుళ్ళు, సర్దం గోవిందు, కె.శ్రీను పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా కత్తిపూడి మసీదులో జరిగిన ప్రార్థనల్లో సత్యప్రభ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

**కొత్తపల్లి:** కొండెవరం శివారు శౌరివారిపాకల్లో బీసీ,దళిత సోదరుల ఆత్మీయ సమావేశానికి టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వర్మ వర్మ, తెలంగాణ జనసేన ఇన్‌చార్జి శంకర్ గౌడ్ హాజరయ్యారు. టీడీపీ మండలాధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి, చెలికానీ ఫిల్లింగ్ స్టేషన్ ఎండీ జగదీష్, ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు, వార్డు మెంబరు రాజేష్, మాజీ ఎంపీటీసీలు గాది రాజబాబు, కూరాకుల సుధాకర్, దళిత నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

జగ్గంపేట, ఏప్రిల్ 11: స్థానిక అంబేడ్కర్ కాలనీలో జగ్గంపేట మండలం టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబత్తుల చంద్రశేఖర్, రాజేష్ ఆధ్వర్యంలో మాజీ వార్డు బంటు రాజా, కందరాడ రమేష్, మొగలపు నరేష్, మొగలపు తరుణ్, ఎం.ప్రసాద్, సికోటి పాపారావు, మొల్లిమీ శేఖర్, తదితర పలువురు దళిత యువకులు వైసీపీకి రాజీనామా చేసి జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, జనసైనికులు బోదిరెడ్డి శ్రీనివాస్, సాంబత్తుల చంద్రశేఖర్, రాజేష్,తుమ్మల కిషోర్,ఆకుమర్తి గణేష్ ఉన్నారు.

**సామర్లకోట:** పట్టణ మాజీ కౌన్సిలర్ పంతాడి ధనరాజ్ తన అనుచరులు 50 మందితో కలిసి గురువారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో యానాదుల కాలనీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ కౌన్సిలర్ ధనరాజ్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. సామర్లకోట 27వ వార్డు సాయినగర్‌కు చెందిన నిమ్మకాయల బుజ్జి 25మంది అనుచరులతో చినరాజప్ప సమక్షంలో టీడీపీలో చేరారు.

**ప్రత్తిపాడు:** శంఖవరం మండలం అన్నవరానికి చెందిన 150 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయం వద్ద కూటమి అభ్యర్థి సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు. చేరినవారిలో శంఖవరం మండల మాజీ ఉపాధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, బొమ్మిడి ప్రకాశరావు, కంటిపల్లి నేరిబాబు, కోశెట్టి నూకరాజు, బొమ్మిడి బుల్లబ్బాయి, శెట్టి సింహాద్రి, జెట్టళ్ళ సత్తిబాబు, సమిటి రాజబాబు, సత్తిబాబు, వి.బాబురావు, టి.నందిబాబు, వి.నాగేశ్వరరావు, ఆర్.కొండబాబు ఉన్నారు. మండలంలోని వేములపాలెంలో వరుపుల సత్యప్రభ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 11: గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

**జగ్గంపేట:** జగ్గంపేట 11కేవీ ఫీడర్ నందు చెట్లు నరికివేత, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఏఈ కె.రత్నాలరావు తెలిపారు. జగ్గంపేట, కాట్రావులపల్లి, సీతానగరం, నరేంద్రపట్నం, గుర్రప్పాలెం, గొల్లలగుంట, జెడ్ రాజంపేట, బావవరం పరిధిలోని సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రేపటి నుంచి భక్తిజ్ఞాన మహాసభలు

ఏలేశ్వరం, ఏప్రిల్ 11: మండలంలోని సిరిపురంలో గ్రామంలో చిద్గగనానంద గీతా ఆశ్రమంలో శనివారం నుంచి 3రోజుల పాటు భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు నిర్వహిస్తున్నట్టు నడిశెట్టి తిరపతిరావు తెలిపారు. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం హఠయోగశ్రేష్ట యోగానందభారతీస్వామి ఆధ్వర్యంలో జరిగే సభలకు పలు ఆశ్రమాల పీఠాధిపతులు హాజరవుతారని ఆయన చెప్పారు.

## ఇద్దరికి గాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 11: గండేపల్లి జాతీయ రహదారిపై జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. యర్రవరం నుంచి రాజమహేంద్రవరం వైపు తల్లీకొడుకులు కీడా కుమారి, రాజేష్ మోటారుసైకిల్‌పై వెళ్తుండగా గండేపల్లి జంక్షన్‌లో ఎదుట వెళ్తున్న వాహనం సడన్‌గా ఆపడంతో వెనుక నుంచి వస్తున్న వారి మోటార్‌సైకిల్ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. దీంతో వారిద్దరు గాయాలపాలయ్యారు. విషయం తెలిసి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేశారు.

## బాలిక అదృశ్యంపై కేసు

కరప, ఏప్రిల్ 11: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కరప మండలం ఉప్పలంకకి చెందిన 17ఏళ్ల బాలిక బుధవారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రపోయింది. గురువారం తెల్లవారుజామున తల్లి కె.కుమారి లేచి చూసేసరికి కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## ప్రజాగళానికి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11: టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం పాల్గొన్న అమలాపురం ప్రజాగళం సమావేశానికి మండలంలో ధర్మవరానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు అనుచరులతో తరలివెళ్లారు.

## నాదెండ్లను కలిసిన రమేష్

జగ్గంపేట, ఏప్రిల్ 11: జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను జగ్గంపేట ఇన్‌చార్జ్‌గా తుమ్మలపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెనాలిలో తుమ్మలపల్లి రమేష్ తన అనుచరులతో నాదెండ్ల మనోహర్‌ను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అంశాలపై చర్చించారు.